సాక్షి
అనకాపల్లి
బుధవారం ၊ 26 ၊ జూలై ၊ 2023



పచ్చ'ధనం' 8లో

స్వచ్ఛభారత్ మిషన్ ప్రతినిధి సాక్షి శ్రీవాత్సవ జిల్లాలోని సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు. నిర్వహణ బాగుందన్నారు.



విద్యార్థుల శాంతి ర్యాలీ

విశాఖ: ప్రపంచ వ్యాప్తంగా మానవ హక్కుల పరిరక్షణకు కృషి జరగాలని ఏయూ విద్యార్థులు మంగళవారం ర్యాలీ నిర్వహించారు.

మోస్తరు వర్షసూచన



అనకాపల్లిటౌన్: రాగల ఐదు రోజులు మోస్తరు వర్షసూచన ఉందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం వాతావరణ విభాగం శాస్త్రవేత్త ఎంబీజీఎస్ కుమారి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 26న 22 మి.మీ., 27న 20, 28న 2, 29న 1, 30న 6 మి.మీ. వర్షపాతం నమోదవుతుందన్నారు.

న్యూస్‌రీల్

బైజూస్ పాఠాలు.. నిరంతర పర్యవేక్షణ

ఎంఈవోలకు కలెక్టర్ దిశానిర్దేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

అనకాపల్లి టౌన్: ప్రభుత్వం విద్యార్థులకు పంపిణీ చేసిన బైజూస్ ట్యాబ్‌ల ద్వారా అభ్యసన జరిగేలా మండల విద్యాశాఖాధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అన్నారు. స్థానిక జీవీఎంసీ వేల్పులవీధి పట్టణ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం జిల్లా స్థాయి ఎంఈవోల సమీక్ష సమావేశం జరుగుతుండగా ఆయన ఆకస్మికంగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంఈవోలు ఉపాధ్యాయుల అభ్యసన సామర్థ్యంతోపాటు విద్యార్థుల వర్క్ పుస్తకాలను పరిశీలించాలని సూచించారు. నెలలో 20 పాఠశాలలను సందర్శించాలన్నారు. ఇంటరాక్ట్ ప్లాట్ ప్యానల్లో విద్యాబోధనను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రంలో జిల్లా ప్రథమస్థానంలో నిలిచేందుకు కృషి చేయాలని ఎంఈవోలను ఆదేశించారు. ఎప్పటికప్పుడు విద్యార్థుల నైపుణ్యాన్ని పరిశీలించి, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నంలో ఇరిగేషన్ ఈఈ కార్యాలయం ప్రారంభం



కార్యాలయం ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఇరిగేషన్ సిబ్బంది

నర్సీపట్నం: జలవనరుల శాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ కార్యాలయాన్ని నర్సీపట్నంలో మంగళవారం ప్రారంభించారు. కార్యనిర్వాహక అధికారి బొత్స శ్రీనివాసరావు ప్రత్యేక పూజలు చేసి, కార్యాలయంలోకి అడుగుపెట్టారు. డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ ప్రేమానందరావు తనకు కేటాయించిన విధులు చేపట్టారు. ఇప్పటి వరకు జలవనరులశాఖ ఈఈ కార్యాలయం విశాఖపట్నంలో ఉండేది. ఇరిగేషన్ డివిజన్ల పునర్విభజన తర్వాత విశాఖపట్నం సబ్ డివిజన్‌కు పరిమితమైంది. నర్సీపట్నం, చోడవరంలలో ఇరిగేషన్ డివిజన్ కార్యాలయాల ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. చోడవరంలో ఇప్పటికే కార్యనిర్వాహక ఇంజినీర్ కార్యాలయం ఉండగా నర్సీపట్నంలో కొత్తగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో డీఈ స్వామినాయుడు, ఏఈ రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

జెడ్పీ స్థాయీ సంఘ సమావేశం రేపు

మహారాణిపేట (విశాఖ): జెడ్పీ స్థాయీ సంఘ సమావేశం ఈనెల 27న నిర్వహించనున్నారు. జెడ్పీ సమావేశ మందిరంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ఒకటి నుంచి ఏడు స్థాయీ సంఘాల సమావేశాలు జరుగుతాయని జిల్లా పరిషత్ సీఈవో శ్రీరామ్మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. సభ్యులు, ఉమ్మడి జిల్లా అధికారులు పాల్గొనాలని పేర్కొన్నారు.

108 వాహనాల తనిఖీ




108 వాహనాలు తనిఖీ చేస్తున్న డీఎం త్రినాథరావు

పాయకరావుపేట : స్థానిక పీహెచ్‌సీ వద్ద 108 వాహనాలను ఉమ్మడి జిల్లా డీఎం త్రినాథరావు మంగళవారం తనిఖీ చేశారు. 108 వాహనంలో పరికరాల పనితీరును పరిశీలించి, సిబ్బందికి అవగాహన కల్పించారు. ముఖ్యంగా ఆక్సిజన్ మానిటర్ ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలని సూచించారు. హాజరయ్యే కేసుల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. కాల్ సెంటర్ నుంచి ఫోన్ రాగానే వీలైనంత వేగంగా సంఘటన స్థలానికి చేరుకుని, త్వరితగతిన బాధితుడిని ఆస్పత్రికి చేర్చాలన్నారు. ఈ ఆపరేషన్‌లో అనకాపల్లి డివిజన్ 108 ఓఈలు నాగేశ్వరరావు, శామ్యూల్, సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దేరుపై అప్రమత్తం

- క్యాచ్‌మెంట్ ఏరియాలో వానలతో పెరుగుతున్న ఇన్‌ఫ్లో
- పరిస్థితి ఇలానే ఉంటే రెండు రోజుల్లో గేట్ల ఎత్తివేత
- జలాశయం పరిధిలో 15,105 ఎకరాల్లో సాగుకు సన్నద్ధం



వరద నీటితో కళకళలాడుతున్న జలాశయం



వరి నాట్లు వేస్తున్న రైతులు

మాడుగుల: గత రెండు రోజులుగా పెద్దేరు జలాశయం క్యాచ్‌మెంట్ ఏరియాలో కురుస్తున్న వర్షాలతో జలాశయంలోకి వరద నీటి ఇన్‌ఫ్లో రోజురోజుకూ పెరుగుతోంది. మంగళవారం అందిన సమాచారం మేరకు క్యాచ్‌మెంట్ పరిధిలో 20 మి.మీ. వర్షపాతం నమోదైంది. దీంతో జలాశయం అధికారులు అప్రమత్తమయ్యారు. ఇప్పటికే జలాశయం గేట్లతో పాటు జనరేటర్ పనితీరును పరిశీలించారు. జలాశయం గరిష్ట నీటి మట్టం 137 మీటర్లుకాగా ప్రస్తుతం నీటి మట్టం 136.30 మీటర్లకు చేరింది. ఇన్‌ఫ్లో మరింతగా పెరిగితే రెండు రోజుల్లో జలాశయం ప్రధాన గేట్లు ఎత్తి, వరద నీటిని దిగువకు విడుదల చేస్తామని అధికారులు చెప్తున్నారు.

ఖరీఫ్ వరి నాట్లకు రైతులు సన్నద్ధం

పెద్దేరు జలాశయంలో సాగునీరు ఇప్పటికే పుష్కలంగా ఉండడంతో ఈ ఏడాది ఖరీఫ్ వరి నాట్లకు ఢోకా లేదని రైతులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. జలాశయం ఆయకట్టు పరిధిలో ఖరీఫ్ వరి నాట్లు ప్రారంభమయ్యాయి. జలాశయం ఆర్ఎంసీ ప్రధాన పంట(ఎడమ) కాలువ పరిధిలో 7,050 ఎకరాల ఆయకట్టు ఉండగా, అడపాదడపా కురిసిన వర్షాలతో పాటు వ్యవసాయ మోటారుల సాయంతో 80 ఎకరాల్లో వరి నాట్లు వేశారు. రాచకట్టు(కుడి) కాలువ పరిధిలో 8,055 ఎకరాల ఆయకట్టుకు 200 ఎకరాల్లో ఖరీఫ్ నాట్లు జరిగాయి. ఇప్పటికే చాలా వరకు నారు మడుల్లో నారు ఏపుగా పెరిగి, నాటేందుకు సిద్ధంగా ఉన్నాయి. జలాశయం నుంచి సాగు నీరు విడుదల చేస్తే ముమ్మురంగా వరి నాట్లు వేసుకునేందుకు రైతులు సన్నద్ధంగా ఉన్నారు. ఏడాది వర్షాలతోపాటు జలాశయాలు, పంట చెరువుల్లో కూడా నీటి నిల్వలు ఆశాజనకంగా ఉన్నాయి. ముందుగా నిర్ణయించిన మేరకు ఈ నెల 28న జలాశయం నుంచి సాగునీరు విడుదల చేయాల్సి ఉంది. తాజాగా కురుస్తున్న భారీ వర్షాలకు ముందుగానే గేట్లు ఎత్తి, కాలువల్లోకి నీటి విడుదల జరిగినా ఆశ్చర్యపోనక్కర్లేదు.

పెద్దేరు గ్రామాలు అప్రమత్తం

పెద్దేరు జలాశయంలోకి ఇన్‌ఫ్లో పెరుగుతుండటంతో ఏ సమయంలోనైనా వరద నీరు విడుదల చేసే అవకాశాలున్నాయని తహసీల్దార్ పీవీ రత్నం తెలిపారు. పెద్దేరు నదికి ఆవల ఉన్న రైతులు రాత్రి పూట అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. తాగునీరు, ఇతర అవసరాల కోసం పశువుల్ని పెద్దేరులో దించవద్దని చెప్తున్నారు. ఇప్పటికే పెద్దేరు ప్రభావిత గ్రామాల వీఆర్వోలకు సమాచారాన్ని అందించినట్లు పేర్కొన్నారు.

ముంచెత్తిన వాన

అనకాపల్లిలో 25 మి.మీ. వర్షపాతం నమోదు



నర్సింగరావుపేటలో రహదారిపై నిలిచిపోయిన వర్షపు నీరు

అనకాపల్లి టౌన్ : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా మంగళవారం పట్టణంలో భారీ వర్షం కురిసింది. వారం రోజులుగా కురుస్తున్న జల్లులతో కాలువలు, లోతట్టు ప్రాంతాలు చాలా వరకు జలమయమయ్యాయి. మంగళవారం ఉదయం జల్లులుగా ప్రారంభమై మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో భారీ వర్షంగా మారింది. 25 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం వాతావరణ విభాగం అధికారులు వెల్లడించారు. వర్షం కారణంగా ఇటు విద్యార్థులతోపాటు ఉద్యోగులు, దినసరి కూలీలు, ఫుట్‌పాత్ వ్యాపారులకు ఇబ్బందులు ఎదురయ్యాయి.

- లోతట్టు ప్రాంతాలైన అనకాపల్లి–చోడవరం రహదారిలో రైల్వే అండర్ బ్రిడ్జి కింద వర్షపు నీరు నిలిచిపోవడంతో భారీ వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. లక్ష్మీదేవిపేట రైల్వేక్రాసింగ్ మీదుగా వాహనాలను ట్రాఫిక్ పోలీసులు మళ్లించారు.
- ఏఎంసీ కాలనీ, గవరపాలెంలో పలు ప్రాంతాల్లో రోడ్లు వర్షపు నీరుతో ముంచెత్తాయి. నర్సింగరావుపేట షిర్డీసాయిబాబా ఆలయం వెనుక వీధిలో మోకాలు లోతున నీరు నిలిచిపోయింది. ఈ ప్రాంతంలో బహుళ అంతస్తులు నిర్మించేందుకు ఇసుక, భవన నిర్మాణ సామాగ్రిని రహదారిపై వేయడంతో డ్రైనేజీల్లో మురుగునీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడింది. రోడ్లపైనే వర్షపు నీరు ప్రవహించింది.
- కశింకోట మండలంలో కూడా రోజంతా అడపా దడపా వర్షం కురుస్తూనే ఉంది. స్థానిక పీహెచ్‌సీ రోడ్డు జలమయమైంది.

వచ్చే నెల 1న డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ రాక

ఏయూక్యాంపస్: నగరానికి డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ మనోజ్ కుమార్ సాహు రానున్నారు. ఢిల్లీ నుంచి వచ్చే నెల 1న సాయంత్రం 5.10 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. 2,3 తేదీల్లో కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో సదస్సు జరుగుతుంది. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా తదితరులు పాల్గొంటారు. తప్పులు లేని ఓటర్ల జాబితా తయారీ, కొత్త ఓటర్ల నమోదు తదితర అంశాలపై ఈ సదస్సులో దిశానిర్దేశం చేస్తారు. 3వ తేదీ సాయంత్రం 5.45 గంటలకు విమానంలో ఢిల్లీ బయలుదేరుతారు.

కాలినడకన గిరిజన గ్రామానికి..



అణుకు గ్రామానికి కాలినడకన వెళుతున్న ప్రత్యేకాధికారి ఉదయశ్రీ



గిరిజనుల సమస్యలు తెలుసుకుంటున్న ప్రత్యేకాధికారి

- కలెక్టర్ ఆదేశంతో కదిలిన అధికారుల బృందం
- అణుకు చేరుకొని సమస్యలు అధ్యయనం చేసిన ప్రత్యేకాధికారి

కోటవురట్ల: గిరిజనుల ప్రధాన సమస్యలపై నివేదిక సమర్పిస్తామని మండల ప్రత్యేకాధికారి ఉదయశ్రీ తెలిపారు. గొట్టివాడ శివారు అణుకు గిరిజనులు తమ గ్రామానికి రోడ్డు నిర్మించాలని, గ్రామంలో పాఠశాల ఏర్పాటు చేయాలనే ప్రధాన డిమాండ్లతో గత 19 రోజులుగా రిలే నిరాహార దీక్ష చేస్తున్నారు. సోమవారం స్పందనలో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టికి వినతిపత్రం అందించారు. స్పందించిన కలెక్టర్ వారి సమస్యలపై నివేదిక ఇవ్వాలని మండల ప్రత్యేకాధికారి ఉదయశ్రీని ఆదేశించారు. దాంతో ఆమె రహదారులు, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల అధికారులతో కలిసి మంగళవారం అణుకు గ్రామాన్ని సందర్శించారు. రాళ్లు తేలి ఉన్న రోడ్డులో సుమారు 2 కిలో మీటర్లు నడిచి వారి ఇబ్బందులు తెలుసుకున్నారు. గ్రామంలో విద్య, విద్యుత్, తాగునీటికి ఇబ్బంది పడుతున్నట్టు గుర్తించారు. గిరిజనులతో మాట్లాడి వారి సమస్యలను సావధానంగా ఆలకించారు. ప్రత్యేకాధికారి మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు గిరిజనుల సమస్యలపై నివేదిక తయారు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు, ఈవోపీఆర్డీ సుబ్రహ్మణ్యం, డీటీ సోమశేఖర్, సీపీఎం నాయకుడు జి.డేవిడ్‌రాజ్ పాల్గొన్నారు.

రైతన్నకు మరో కానుక

- శీతల గిడ్డంగులు, సేకరణ కేంద్రాలు
- వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం వైఎస్ జగన్



సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, ఎమ్మెల్యే అదీప్‌రాజ్, జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర, వైస్ చైర్‌పర్సన్ సత్యవతి

తుమ్మపాల: శీతల గిడ్డంగులు, సేకరణ కేంద్రాల వల్ల రైతుల ఉత్పత్తులకు ఎంతో మేలు జరుగుతుందని ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయం నుంచి మంగళవారం ఉద్యాన ఉత్పత్తుల సేకరణ కేంద్రాలు, శీతల గిడ్డంగులను రైతులకు అంకితం చేశారు. ఈ కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టరేట్ నుంచి విప్ ధర్మశ్రీ, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో గిడ్డంగులు ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యంగా పెందుర్తి, చోడవరం నియోజక వర్గాల రైతులకు మద్దతు ధరకు మించి అమ్ముకునేందుకు అవకాశం కలిగిందన్నారు.

జిల్లాలో రూ.7.27 కోట్ల అంచనా వ్యయంతో 36 పంట సేకరణ కేంద్రాలు, 15 శీతల గిడ్డంగుల నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయని వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ముఖ్యమంత్రికి వివరించారు. రూ.3.20 కోట్లతో ఇప్పటివరకు 18 ఉద్యాన పంట సేకరణ కేంద్రాలు, 4 శీతల గిడ్డంగులు నిర్మించామన్నారు. సేకరణ కేంద్రాల ద్వారా పండ్లు, కూరగాయలు, ఇతర ఉత్పత్తులను శుభ్రపరచి నిల్వ చేసుకునే సౌకర్యం కలిగిందన్నారు. ఎమ్మెల్యే అదీప్‌రాజ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర, వైస్ చైర్‌పర్సన్ భీశెట్టి వరాహ సత్యవతి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రభాకరరావు, అమృతఫల రైతు ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్ అప్పలనాయుడు, సీఈవో కె.మౌక్తిక పాల్గొన్నారు.

అభివృద్ధిపైనే ఫోకస్



కౌన్సిల్ సమావేశంలో మేయర్ హరి వెంకటకుమారి

- వాడీవేడిగా సాగిన జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం
- 44 అంశాలు, 41 సప్లిమెంటరీ, 7 టేబుల్ అజెండా అంశాలకు ఆమోదం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

సాక్షి, విశాఖపట్నం: జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం వాడీవేడిగా జరిగింది. విపక్షాల ప్రశ్నలకు అధికార పక్షం దీటుగా సమాధానాలిచ్చింది. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో మంగళవారం మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం ప్రారంభమైంది. ముందుగా జీరో అవర్‌లో సభ్యులు పలు అంశాలను లేవనెత్తారు. కౌన్సిల్ సమావేశంలో మొత్తంగా 44 అంశాలు, 41 సప్లిమెంటరీ అంశాలతో పాటు 7 టేబుల్ ఎజెండా అంశాలపై చర్చ సాగింది. విశాఖ నగర అభివృద్ధి, మెరుగైన పారిశుధ్యం, వ్యర్థాల నిర్వహణ, కాలుష్య నివారణ, పర్యావరణ సమతుల్యత, ఎకో–వైజాగ్‌లో ప్రజలను భాగస్వామ్యం చేయడం, ఎకో–ఫండ్, సొసైటీ తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. 8 జోన్లలో అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదముద్ర వేసింది. మరికొన్ని పరిపాలనా అంశాలపై చర్చ సాగింది. ఇటీవల ఎన్నికైన స్థాయీ సంఘ సభ్యులను ముందుగా కౌన్సిల్ సభ్యులకు పరిచయం చేశారు.

కౌన్సిల్ జరిగిందిలా..

ఉదయం 11 గంటలకు మేయర్, కౌన్సిల్ చైర్‌పర్సన్ గొలగాని హరివెంకటకుమారి బెల్ మోగించి సభ ప్రారంభించారు. గత కౌన్సిల్ సమావేశంలో మాదిరిగానే జీరో అవర్ కేటాయించాలని మేయర్‌ను కార్పొరేటర్లంతా కోరారు. ఉదయం 11.20 గంటలకు ప్రారంభమైన జీరో అవర్ మధ్యాహ్నం 2.30గంటల వరకు కొనసాగింది. 98 మంది సభ్యుల్లో 50 శాతం మంది తమ సమస్యలు విన్నవించుకున్నారు. లంచ్ తర్వాత 44 అంశాలు, 41 సప్లిమెంటరీ అంశాలతో పాటు 7 టేబుల్ ఎజెండా అంశాలను సభ్యులు చర్చించి ఆమోదించారు.

ప్రధాన చర్చ సాగిన అంశాలివే..

- 8 జోన్లలో అభివృద్ధిపై విస్తృత చర్చ
- 10 వేలకు పైగా వీధిలైట్లు వెలగలేదని నివేదిక..
- టాస్క్‌ఫోర్స్ కమిటీ వేస్తున్నట్టు కమిషనర్ ప్రకటన
- సీజనల్ వ్యాధులపై తీసుకుంటున్న చర్యలు
- పర్యావరణ సమతుల్యత, బీచ్ క్లీనింగ్, ఎకో ఫండ్–ఎకో వైజాగ్
- వేసవి శిక్షణ శిబిరాల్లో అవినీతిపై నిగ్గు తేల్చాలని కార్పొరేటర్లు పట్టు..
- విచారణకు మేయర్ ఆదేశం
- సిటీలో రెండు సీ ఫుడ్ కోర్టుల ఏర్పాటు.. నైట్ ఫుడ్‌కోర్టు ఎత్తివేత
- బీచ్‌రోడ్డులో డివైడర్ చుట్టూ ఫెన్సింగ్
- అనకాపల్లి అభివృద్ధిపై ప్రధాన దృష్టి

మురికివాడల అభివృద్ధిపై దృష్టి సారించండి

జీవీఎంసీ పరిధిలో మురికివాడల అభివృద్ధికి అధికారులు దృష్టి సారించాలని మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సూచించారు. ఈ అంశంపై ప్రతి నెలా సమావేశం నిర్వహించాలన్నారు. కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాల బానిసలకు పోలీసులు శిక్ష అమలు చేస్తున్నా.. వారిలో మార్పు రావడం లేదన్నారు. అలాంటి వారి కోసం జీవీఎంసీ ఆధ్వర్యంలో పునరావాస, కౌన్సెలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. జీవీఎంసీ 6వ వార్డు పరిధిలో చంద్రంపాలెం స్కూల్ వద్ద ఫ్లై/ఫుట్ ఓవర్ బ్రిడ్జి లేకపోవడంతో నాలుగు వేల మంది పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని వార్డు కార్పొరేటర్ ప్రియాంక తెలిపారు. ఇక్కడ రోడ్డు ప్రమాదాలు జరగకుండా తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. దీనిపై మేయర్ మాట్లాడుతూ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కమిషనర్ సాయికాంత్ వర్మను ఆదేశించారు.

ఆమోదించిన అంశాల్లో కొన్ని

- రూ.12.5 కోట్లతో జగదాంబ జంక్షన్ నుంచి క్వీన్ విక్టోరియా విగ్రహం జంక్షన్ వరకు 60 అడుగుల రోడ్డు విస్తరణ, వరద కాలువల నిర్మాణానికి ఆమోదం.
- హనుమంతువాక జంక్షన్ నుంచి కైలాసగిరి సర్కిల్ వరకు రూ.3.9 కోట్లతో ఫుట్‌పాత్ నిర్మాణం
- సిటీ బ్యూటిఫికేషన్, పార్క్ హోటల్, సాగర్ నగర్ బీచ్‌రోడ్ సమీపంలో రెండు సీ ఫుడ్ స్ట్రీట్ కోర్టుల ఏర్పాటుకు ఆమోదం
- మెప్మా ఆధ్వర్యంలో మరో 38 మంది కమ్యూనిటీ ఆర్గనైజర్లను నియమించేందుకు తీర్మానం
- బీచ్ క్లీనింగ్ కోసం రూ.1.82 కోట్ల పనులకు ఆమోదం
- అనకాపల్లిలో సుంకరమెట్ట జంక్షన్ నుంచి శారదా బ్రిడ్జి వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.1.93 కోట్లు, సెంట్రల్ మీడియన్‌కు రూ.64 లక్షలు, సెంట్రల్ లైటింగ్ కోసం రూ.85 లక్షలు, ఫుట్‌పాత్, రోడ్డు విస్తరణకు రూ.1.4 కోట్లు కేటాయిస్తూ ఆమోదం
- రూ.2.8 కోట్లతో అనకాపల్లి పెరుగు బజార్ నుంచి గాంధీ బొమ్మ జంక్షన్ వరకు డ్రైనేజీ ఏర్పాటుకు ఆమోదం
- జైలురోడ్డులోని నైట్ ఫుడ్‌కోర్టు ఎత్తి వేసేందుకు ఆమోదం

టీడీపీ సభ్యుల సస్పెన్షన్.. ఎత్తివేత

బీచ్‌రోడ్డులో నాలుగు కిలోమీటర్లకు రూ.2 కోట్లతో డివైడర్ చుట్టూ ఫెన్సింగ్ ఖర్చుపై టీడీపీ కార్పొరేటర్లు వివరణ కోరగా అధికార పార్టీ కార్పొరేటర్లు సమాధానమిచ్చారు. దీనికి టీడీపీ కార్పొరేటర్లు సంతృప్తి చెందకపోగా.. ఆందోళన చేసి సమావేశాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. దీంతో మేయర్ ఆగ్రహించారు. సభా సంప్రదాయాలను పాటించకుంటే సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు. అయినా వారు వినకపోవడంతో టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు సహా 8 మంది సభ్యులను సభ నుంచి సస్పెండ్ చేశారు. దీంతో ప్రతిపక్ష సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. ప్లకార్డులతో మేయర్ పోడియాన్ని చుట్టుముట్టారు. వీరికి తోడుగా జనసేన, వామపక్ష, బీజేపీ సభ్యులు జత కలిశారు. దీంతో మేయర్ సభను 10 నిమిషాల పాటు వాయిదా వేశారు. అనంతరం మేయర్ టీడీపీ సభ్యులపై సస్పెన్షన్ ఎత్తివేస్తున్నట్టు ప్రకటించారు. అ తర్వాత 44 అంశాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. అనంతరం టేబుల్ అజెండాలోని అంశాలను మేయర్ చదివారు.

రాష్ట్రీయ బాల పురస్కారాలకు దరఖాస్తు

అనకాపల్లి టౌన్: శిశు అభివృద్ధి మంత్రిత్వశాఖ రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నిస్వార్థసేవ, అనితర ధైర్య సాహసాలు ప్రదర్శించిన బాల బాలికలు, ఆటలు, సామాజిక సేవ, సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణం, కళలు తదితర రంగాల్లో వినూత్న ఆవిష్కరణలు చేసిన 18 ఏళ్లలోపు బాలబాలికలు ఈ అవార్డుకు అర్హులని పేర్కొన్నారు. ఆగస్టు 31వతేదీలోగా http://awards.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్ ప్రిన్సిపాల్‌గా వెంకటరమణ



మురళీనగర్ (విశాఖ): నగరంలోని ప్రభుత్వ ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్ ప్రిన్సిపాల్‌గా కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ(గైస్) ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ సి.నాగరాణి ఉత్తర్వులు జారీ చేశారు. ఫుడ్‌క్రాఫ్ట్ ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న ఎస్.రవి సెలవుపై వెళ్తున్నందున.. ఆయన స్థానంలో డాక్టర్ వెంకటరమణను పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రిన్సిపాల్‌గా నియమించారు. ఇలా ఆయన్ని ఫుడ్ క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్‌కు ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్‌గా నియమించడం ఇది రెండోసారి. గతంలో ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్‌గా రమణ పనిచేసిన కాలంలో ఇన్‌స్టిట్యూట్ స్థల పరిరక్షణకు చర్యలు తీసుకోవడంతో పాటు విద్యార్థుల్లో ఫుడ్‌క్రాఫ్టింగ్‌పై ఆసక్తి, ప్రేరణ కలిగించేందుకు సెమినార్లు ఏర్పాటు చేశారు.

ఈస్ట్రన్ రైల్వేస్‌కు వాల్తేర్ పూర్వ డీఆర్ఎం



అనూప్ కుమార్ సత్పతి

తాటిచెట్లపాలెం (విశాఖ): వాల్తేర్ డివిజన్ పూర్వ డివిజనల్ రైల్వే మేనేజర్ అనూప్‌కుమార్ సత్పతి ఈస్ట్రన్ రైల్వేస్, కోల్‌కతాకు పదోన్నతిపై బదిలీ అయ్యారు. ఈ మేరకు రైల్వే బోర్డు నుంచి మంగళవారం అధికారిక ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆయనతో పాటు పలువురు డీఆర్ఎంలను బదిలీ చేశారు.

క్లుప్తంగా

మోహరించిన బలగాలు

- 28న ప్రారంభం కానున్న మావోయిస్టుల వారోత్సవాలు
- ముమ్మరంగా విస్తృత తనిఖీలు



సీలేరులో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

సీలేరు: మావోయిస్టుల వారోత్సవాలు ఈనెల 28 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఆంధ్రా–ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో పోలీసు బలగాలు మోహరించాయి. ఏజెన్సీ సరిహద్దు పోలీసుస్టేషన్లలో అప్రమత్తంగా ఉండాలని ఉన్నతాధికారుల నుంచి ఇప్పటికే ఆదేశాలు వెలువడ్డాయి.ఈ నేపథ్యంలో పోలీసులు ఏజెన్సీ, సరిహద్దు ప్రాంతాల్లో ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. మంగళవారం గూడెం కొత్తవీధి సీఐ అశోక్‌కుమార్, సీఆర్‌పీఎఫ్ బలగాలు కలిసి సీలేరు పరిసర ప్రాంతాలు, జల విద్యుత్ కేంద్రం , ఇతర ప్రభుత్వ శాఖల ప్రధాన కేంద్రాల వద్ద గస్తీ ఏర్పాటు చేశారు. వంతెనలు, చెక్‌డ్యాంల వద్ద తనిఖీలు నిర్వహించారు. విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. అనుమానాస్పద వ్యక్తులను విచారిస్తున్నారు.

మత్తుకు దూరంగా ఉండాలి

ఏయూ క్యాంపస్: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు సూచించారు. మంగళవారం ఏయూ సైన్స్ కళాశాల పరిధిలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ ఉన్నత లక్ష్యాలతో ఎదగాలన్నారు. ఏయూ జాతీయ సేవా పథకం సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్ మాట్లాడుతూ యువత దేశానికి విలువైన సంపదని చెప్పారు. మూడో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ కె.రామారావు వివిధ చట్టాలపై, శిక్షలు, పర్యవసానాలను వివరించారు.

అందరి ఆమోదంతోనే రహదారి విస్తరణ

- భవన యజమానుల అభిప్రాయాన్ని గౌరవిస్తాం
- ఇంటింటికీ వెళ్లి స్వయంగా కలిసిన ఎమ్మెల్యే గణేష్



ఎమ్మెల్యే గణేష్‌కు అంగీకార పత్రాలు అందజేస్తున్న భవన యజమానులు

నర్సీపట్నం: అభివృద్ధి కోసం భవన యజమానుల అభిప్రాయాన్ని గౌరవిస్తానని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ స్పష్టం చేశారు. దీనిలో భాగంగా మంగళవారం కొంత మందిని కలవడంతో 90 అడుగులకు విస్తరిస్తే అభ్యంతరం లేదని అంగీకార పత్రాలను ఇచ్చారు. గతంలో నర్సీపట్నం మెయిన్ రోడ్డు వందడుగులకు విస్తరించాలని మున్సిపల్ కౌన్సిల్ నిర్ణయం తీసుకుంది. దాంతో 80 అడుగులకు కుదించాలని కొందరు భవన యజమానులు కోరుతున్నారు. వీరిలో 17 మంది హైకోర్టును సైతం ఆశ్రయించారు. ఈ అడ్డంకులు అధిగమించి రోడ్డు విస్తరణ సజావుగా సాగించేందుకు ప్రజల ఆకాంక్ష నెరవేర్చేందుకు ఎమ్మెల్యే భవన యజమానుల ఇంటికి వెళ్లి స్వయంగా కలుస్తున్నారు. ఈ సందర్భంగా వ్యాపారవేత్త నారాయణరావు ఇంట్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో 120 అడుగులకు విస్తరించాలని నిర్ణయించారన్నారు. 120 అడుగులైతే భవన యజమానులు నష్టపోతారని భావించి వందడుగులకు విస్తరించాలని మున్సిపల్ కౌన్సిల్‌లో నిర్ణయం తీసుకున్నామన్నారు. తమ ఇబ్బందులను పరిగణలోకి తీసుకుని వందడుగులకు కాకుండా 90 అడుగులకు కుదించాలని భవన యజమానులు కోరుతున్నారన్నారు. అభివృద్ధి కోసం వారి అభ్యర్థనను పరిగణలోకి తీసుకుంటామన్నారు. రోడ్డు విస్తరణకు సహకరించాలన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గొలుసు నర్సింహమూర్తి, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, కౌన్సిలర్ మాకిరెడ్డి బుల్లిదొర, సచివాలయ కన్వీనర్ తమరాన శ్రీను, పార్టీ సీనియర్ నాయకులు ధనిమిరెడ్డి నాగు, గుడబండి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పచ్చ'ధనం'.. ముగ్ధమనోహరం



మునగపాక సంపద తయారీ కేంద్రంలో అధికారులు, పంచాయతీ సిబ్బందితో స్వచ్ఛభారత్ మిషన్ సెంట్రల్ టీమ్ ప్రతినిధి సాక్షి శ్రీవాత్సవ

సర్వత్రా పచ్చదనం.. ఆహ్లాదకర వాతావరణం.. సేకరించిన తడి, పొడి చెత్త నుంచి విలువైన ఎరువుల తయారీ.. స్వచ్ఛభారత్ మిషన్ బృందాన్ని విశేషంగా ఆకట్టుకున్నాయి. జిల్లాలోని సంపద తయారీ కేంద్రాల పరిశీలనకు ఢిల్లీ నుంచి వచ్చిన మిషన్ సెంట్రల్ టీమ్ ప్రతినిధి సాక్షి శ్రీవాత్సవ వాటి పనితీరుకు ముగ్ధులయ్యారు. మునగపాకలో అధికారులు, పంచాయతీ సిబ్బందితో కలిసి ప్రత్యేకంగా ఫొటో దిగారు. ఈ సందర్భంగా ఆమె ఈ కేంద్రాల్లో తయారవుతున్న వర్మీకంపోస్టుతో పాటు ఇతర అమ్మకాల ద్వారా వచ్చిన ఆదాయం వివరాలు అడిగి తెలుసుకున్నారు. తడి, పొడి చెత్త సేకరణ గురించి ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలని, ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు పర్యవేక్షించాలని చెప్పారు. పరవాడ మండలం వెన్నెలపాలెం గ్రామంలో అమలు జరుగుతున్న చెత్తతో సంపద తయారీ కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, పారిశుధ్య నిర్వహణ తీరుతెన్నులను స్థానిక అధికారులతో కలిసి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. బృందం పర్యటనలో డీపీవో శిరీషరాణి, సంపద తయారీ కేంద్రాల నిర్వహణ జిల్లా కోఆర్డినేటర్ నాగలక్ష్మి, ఎంపీడీవో మన్మధరావు, ఈవోఆర్డీలు ఈశ్వరరావు, ధర్మారావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ నాగేశ్వరరావు, ఏఈ ఉమామహేష్, తదితరులు పర్యటనలో పాల్గొన్నారు.

–మునగపాక/అనకాపల్లి టౌన్/పరవాడ

భార్యపై అనుమానంతో హత్య

- పోలీసులకు లొంగిపోయిన భర్త
- తోటాడలో ఘటన



హత్యకు గురైన దీనమ్మ



నిందితుడు నూకప్పారావు నుంచి వివరాలు సేకరిస్తున్న యలమంచిలి సీఐ గఫూర్

మునగపాక: భార్యపై అనుమానంతో కోపోద్రిక్తుడైన భర్త ఆమె మెడకు చున్నీ బిగించి హత్య చేశాడు. ఆపై పోలీసులకు లొంగిపోయాడు. ఈ సంఘటన మంగళవారం మండలంలోని తోటాడలో చోటు చేసుకుంది. గ్రామంలో దళితవాడకు చెందిన కొత్తలంక నూకప్పారావు స్థానికంగా సీలింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి పదేళ్ల క్రితం గొలుగొండ మండలం గుండుపాలకు చెందిన దీనమ్మ(26)తో వివాహమైంది. వీరికి ముగ్గురు సంతానం. పిల్లలు స్థానికంగా ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్నారు. ఈ నేపథ్యంలో తన భార్య వేరొకరితో వివాహేతర సంబంధం పెట్టుకోవడాన్ని జీర్ణించుకోలేకపోయాడు. ఈ విషయమై భార్యతో తరచూ గొడవపడేవాడు. ఈ క్రమంలో ఇతర ప్రాంతాల్లో వేరే కాపురం ఉంటూ వచ్చారు. అయినప్పటికీ ఆమె ప్రవర్తనలో మార్పు లేకపోవడంతో అసహనానికి గురయ్యాడు. ఇంతలో ఇరువురి మధ్య గొడవలు పెరిగిపోవడంతో ఈ నెల 23న పెద్దల వద్ద పంచాయితీ పెట్టించారు. దీనిలో భాగంగా ఉదయం 9.30 గంటల ప్రాంతంలో తమ పిల్లలు బడికి వెళ్లిపోయాక మరోసారి ఇద్దరి మధ్య వివాదం చోటు చేసుకుంది. దీంతో భర్త కోపోద్రిక్తుడై భార్య మెడకు చున్నీ బిగించాడు. ఈ పెనుగులాటలో అక్కడికక్కడే ఆమె మృతి చెందింది. అతడు నేరుగా అనకాపల్లి దిశ పోలీసు స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. విషయం తెలుసుకున్న యలమంచిలి రూరల్ సీఐ గఫూర్ నూకప్పారావును అదుపులోకి తీసుకున్నారు. వీఆర్వో సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు గఫూర్ తెలిపారు. నిందితుడి ఇంటిని క్లూస్ టీమ్ పరిశీలించింది. పరవాడ డీఎస్పీ సత్యనారాయణ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని అనకాపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించారు. ఇదిలా ఉండగా ఉదయం ఎంతో సరదాగా స్కూల్‌కు వెళ్లిన పిల్లలు తమ తల్లికి జరిగిన ఘోరాన్ని చూసి కన్నీటి పర్యంతమయ్యారు. తల్లి లేని పిల్లలు ఎలా బతుకుతారో అని స్థానికులు సైతం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నక్కపల్లి మండలంలో ఇద్దరికి డెంగ్యూ



బాధితుల ఇళ్ల వద్ద క్లోరినేషన్ చేపడుతున్న సిబ్బంది

నక్కపల్లి : మండలంలో డెంగ్యూ కేసులు నమోదయ్యాయి. ఉపమాకకు చెందిన ఆదిమూర్తి అనే వృద్ధుడు తీవ్రమైన జ్వరంతో బాధపడుతున్నాడు. కుటుంబ సభ్యులు బుధవారం విశాఖ కేజీహెచ్‌కు తీసుకెళ్లగా అక్కడ పరీక్షలు నిర్వహించి డెంగ్యూగా నిర్ధారించారు. పెద తీనార్లకు చెందిన రమ్య అనే ఏడేళ్ల చిన్నారికి కూడా డెంగ్యూ సోకింది. ప్రస్తుతం వీరికి విశాఖలో చికిత్స అందిస్తున్నారు. ఉపమాక, పెద తీనార్ల గ్రామాల్లో గొడిచర్ల పీహెచ్‌సీ వైద్య సిబ్బంది క్లోరినేషన్ కార్యక్రమాలు నిర్వహించారు. బ్లీచింగ్ , ఫినాయిల్ జల్లించారు.

చుట్టుపక్కల వారిని కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో నీటిలో మార్పులు వస్తాయని అలాగే కాచి చల్లార్చిన నీటిని తాగాలని, చేపలు, నిల్వ ఉన్న మాంసం తినరాదని అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. జ్వర లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలో ఉన్న పీహెచ్‌సీలో సంప్రదించాలన్నారు. పంచాయతీ వారు కూడా గ్రామాల్లో వీధుల్లో చెత్తను తొలగించి మురుగు కాలువల్లో పూడిక తీత పనులు చేపట్టాలని సూచించారు.

13 ఏళ్లకు దొరికారు..

2010లో జరిగిన హత్య కేసులో ముగ్గురు నిందితుల పట్టివేత



పట్టుబడ్డ ముగ్గురు నిందితులతో పోలీసులు

కొయ్యూరు : బూదరాళ్ల పంచాయతీ చల్దిగెడ్డలో 2010లో జరిగిన హత్య కేసులో 13 సంవత్సరాలుగా తప్పించుకు తిరుగుతున్న ముగ్గురు నిందితులను కొయ్యూరు సీఐ స్వామినాయుడు, మంప ఎస్‌ఐ లోకేష్‌కుమార్ ఆధ్వర్యంలో పట్టుకున్నారు. వారిని రిమాండ్‌కు తరలించారు. కేసు వివరాలను సీఐ మంగళవారం సాయంత్రం విలేకరులకు తెలిపారు.

భూ వివాదం కారణంగా 2010లో మంప స్టేషన్ పరిధిలో చల్దిగెడ్డ సమీపంలో కొత్తపల్లికి చెందిన బొంజిబాబు హత్య జరిగింది. తూములోవ, చల్దిగెడ్డకు చెందిన ఆరుగురు వ్యక్తులు కలిసి బొంజిబాబును చంపినట్టుగా పోలీసులు నిర్ధారించారు. ఈ కేసులో ఇప్పటి వరకు కొత్తపల్లికి చెందిన కొర్రా త్రినాథ్, బుజ్జిబాబు, మరొకరిని అరెస్టు చేశారు. మిగిలిన వారి కోసం ఆచూకీ తెలుసుకుని వారిని పట్టుకునే ప్రయత్నం చేశారు. కొత్తపల్లికి చెందిన గెమ్మెలి రాంబాబు, తూములోవకు చెందిన గెమ్మెలి బుజ్జిబాబు, అదే గ్రామానికి చెందిన పాంగి అప్పారావును బుధవారం అరెస్ట్ చేశారు. వారిలో ఒకరిని కొత్తపల్లి సమీపంలోను, మరొకరిని కాకరపాడు-ములకలపాడు సమీపంలో, మరికరిని మైదాన ప్రాంతంలో పట్టుకున్నారు. ఈ కేసులో మిగిలిన ముగ్గురు నిందితులు 13 ఏళ్లుగా తప్పించుకుని తిరిగారని, ఎట్టకేలకు వారి ఆచూకీ తెలుసుకుని సిబ్బంది సహకారంతో పట్టుకున్నామని సీఐ స్వామినాయుడు వివరించారు.

ఏడాదికి రెండుసార్లు రక్తదానం చేయొచ్చు



జైదేవ్‌ను శాలువతో సత్కరిస్తున్న కోరిబిల్లి పరి

అనకాపల్లి టౌన్: ఆరోగ్యవంతులైన వ్యక్తులు ఏడాదికి రెండుసార్లు రక్తదానం చేయవచ్చని రక్తదాన చైతన్య యాత్ర (సైకిల్ యాత్ర) ప్రతినిధి రౌతు జైదేవ్ అన్నారు. గత ఏడాది అక్టోబర్ 1న రక్తదాన చైతన్య యాత్రను ప్రారంభించిన జైదేవ్ మంగళవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌కు (విజయ రెసిడెన్సీ ఫంక్షన్ హాలు)చేరుకున్నారు. సర్వేజన ఐక్య వేదిక వ్యవస్థాపకుడు, హ్యూమన్‌రైట్స్ జిలా అధ్యక్షుడు కోరిబిల్లి పరి జైదేవ్‌ను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా జైదేవ్ మాట్లాడుతూ కోల్‌కతా, వారణాసి, చెన్నై, విజయవాడ, రాజమహేంద్రవరం మీదుగా అనకాపల్లి చేరుకున్నట్టు తెలిపారు. రోజుకు 62 నుంచి 70 కిలోమీటర్లు సైకిల్‌పై యాత్ర చేస్తూ, రక్తదానంపై అవగాహన కార్యక్రమాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. విశాఖ, విజయనగరం మీదుగా కోల్‌కతాకు ఈ ఏడాది అక్టోబర్ 5వ తేదీకి చేరుకోవడం జరుగుతుందని చెప్పారు. ఇప్పటివరకూ 44సార్లు రక్తదానం చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఐక్యవేదిక సభ్యులు కృష్ణమూర్తి, పెంటకోట ప్రసాద్, వేగి త్రినాథ్, కాంతిగల శ్రీను, బొడ్డేడ సూర్య పాల్గొన్నారు.

మదిని దోచేస్తున్న మన్యం

మన్యంలో ప్రకృతి అందాలు కట్టిపడేస్తున్నాయి. ఒక పక్క ఎటుచూసినా పచ్చదనం.. మరోపక్క మేఘాలు దోబూచులాట.. శీతాకాలాన్ని తలపించేలా మంచు తెరలు ఇలా ఎన్నో అందాలకు నిలయంగా మారింది. అరకులోయ పద్మాపురం జంక్షన్ సమీపంలో పంట భూముల వద్ద మంగళవారం ఉదయం సప్తవర్ణాలతో ఇంద్రధనస్సు కనువిందు చేసింది. ఆంధ్ర–ఒడిశా సరిహద్దులోని డుడుమ జలపాతం వద్ద భారీగా కురుస్తున్న పొగమంచు అందాలు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ఈ ప్రాంతానికి ఒడిశా, ఆంధ్ర రాష్ట్రాల నుంచి పర్యాటకులు కుటుంబ సమేతంగా తరలివస్తున్నారు.

– సాక్షి, పాడేరు/ముంచంగిపుట్టు



అరకు పద్మాపురం జంక్షన్‌కు సమీపంలో కనువిందు చేసిన హరివిల్లు



డుడుమ జలపాతం సమీపంలో పొగమంచు అందాలు



డుడుమ వ్యూ పాయింట్ వద్ద ఫొటోలు తీసుకుంటున్న పర్యాటకులు

మన్యంలో ట్రైనీ కలెక్టర్ల బృందం పర్యటన



డల్లాపల్లి వ్యూపాయింట్‌ను సందర్శించిన ట్రైనీ కలెక్టర్లతో ఐటీడీఏ పీవో అభిషేక్

సాక్షి,పాడేరు: పాడేరు ప్రాంతంలో పది మందితో కూడిన ట్రైనీ కలెక్టర్ల బృందం మంగళవారం పర్యటించింది. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలుజేస్తున్న గిరిజనుల సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో బృందం సభ్యులు పరిశీలించారు. కాఫీ సాగుకు గుర్తింపు పొందిన మోదాపల్లి గ్రామాన్ని సందర్శించారు .ఇక్కడ కాఫీతోటలను పరిశీలించారు. కాఫీసాగు, అంతరపంట మిరియాల సాగు ద్వారా ఆదాయం, మార్కెటింగ్ వివరాలను ఐటీడీఏ పీవో వి.అభిషేక్ వారికి వివరించారు. డల్లాపల్లిలో వ్యూపాయింట్‌ను సందర్శించి ఇక్కడ ప్రకృతి అందాలను తిలకించారు. పాడేరులోని వన్‌ధన్ మార్ట్‌ను సందర్శించి, మోదకొండమ్మతల్లిని దర్శించుకున్నారు. బంగ్లాలో కలెక్టర్ సుమిత్‌కుమార్ వారితో సమావేశమయ్యారు. జిల్లా విస్తీర్ణం, గిరిజన ప్రజల జీవన విధానం, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను కలెక్టర్ వారికి వివరించారు. అనంతరం అరకులోయ పర్యటనకు వెళ్లారు.అక్కడ రాత్రి బస అనంతరం బుధవారం అరకులోయ,అనంతగిరి మండలాల్లో పర్యాటిస్తారు.

క్లుప్తంగా

8 మందికి కంటి శస్త్ర చికిత్సలు



శస్త్రచికిత్స చేయించుకున్న వారితో సిబ్బంది

అనకాపల్లిటౌన్: స్థానిక గవరపాలెం ఏఎంఏఏ ఎం రోటరీ కంటి ఆస్పత్రిలో మంగళవారం 8 మంది రోగులకు ఐవోఎల్ ఆపరేషన్లు చేసినట్లు ఆస్పత్రి కమిటీ అధ్యక్షుడు పీజే నాయుడు తెలిపారు. సోమవారం 36 మంది రోగులను పరీక్షించగా, వారిలో 8 మందికి ఆపరేషన్లు అవసరమని నిర్ధారించినట్టు తెలిపారు. డాక్టర్ మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ శస్త్రచికిత్సలు నిర్వహించినట్టు పేర్కొన్నారు. రోగులకు వారం రోజులకు సరిపడా మందులు ఉచితంగా అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి ఎ.రామకృష్ణ, కోశాధికారి ఆర్.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు

కశింకోట: మండలంలోని మూడు సచివాలయాల పరిధిలో నాలుగు గ్రామ వలంటీర్ ఖాళీలను ఆన్‌లైన్ ద్వారా భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీవో వి.వి.రవికుమార్ మంగళవారం తెలిపారు. ఈ నెల 27లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వెదురుపర్తిలో ఎస్సీ జనరల్, తేగాడ సచివాలయ పరిధిలోని పేరంటాల పాలెంలో బీసీ మహిళ, ఏఎస్ పేట పరిధి సోమవరం గ్రామంలో ఎస్సీ మహిళ, బీసీ జనరల్ కేటగిరీలో వలంటీర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈ ఏడాది జులై 25 నాటికి 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయసుతో, టెన్త్ ఉత్తీర్ణులై ఉండాలన్నారు. కుల ధ్రువీకరణ పత్రం తప్పనిసరని తెలిపారు. గ్రామ పంచాయతీకి చెందిన స్థానికులై ఉండాలన్నారు. స్థానికత గుర్తింపు కోసం బియ్యం కార్డు/ ఆధార్ కార్డు/ నివాస ధ్రువపత్రం సమర్పించాలన్నారు. ఆన్‌లైన్ ద్వారా అందిన దరఖాస్తులను ఈ నెల 28న పరిశీలించి, 31న సెలక్షన్ కమిటీ ద్వారా అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు.

యువతి అదృశ్యం

అనకాపల్లి టౌన్: మండలంలో మూలపేటకు చెందిన డి.కోమలి(19) అదృశ్యమైనట్లు పట్టణ పోలీస్‌లకు మంగళవారం ఫిర్యాదు అందింది. ఎస్‌ఐ ప్రసాద్ కథనం మేరకు వివరాలు.. మూలపేటకు చెందిన కోమలి సోమవారం పట్టణంలోని మార్కెట్‌కు వెళ్లి వస్తానని బయలుదేరింది. ఒక రోజు గడిచినా ఇంటికి చేరుకోకపోవడంతో కోమలి తల్లి భవాని పోలీసులనాశ్రయించింది. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అనకాపల్లి సినిమాలు

బేబి	: రాజా
హిడింబ	: సత్యనారాయణ స్క్రీన్-1
మహావీరుడు	: సత్యనారాయణ స్క్రీన్-2
హత్య	: షిర్డిసాయి
మిషన్ ఇంపాజిబుల్ (తెలుగు)	: పర్తిసాయి
కార్తీక	: వెంకటేశ్వర
అన్నపూర్ణ ఫొటో స్టూడియో	: శ్రీసత్య
సామజవరగమన	: రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు మంగళవారం 207 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	-	-
రెండో రకం	3,940	4,090
మూడోరకం	-	-

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్త నిధి కేంద్రంలో 73 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-9 యూనిట్లు, ఏ నెగిటివ్-3 యూనిట్లు, బీ పాజిటివ్-30 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్ 20 యూనిట్లు, ఓ నెగిటివ్-2 యూనిట్లు, ఏబీ పాజిటివ్-8 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 331 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 186 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

ఇక పక్కా.. ఓటర్ల లెక్క

మీ ఓటు ఎక్కడ ఉంది? చిరునామా మార్చాలనుకుంటున్నారా? ఒకే ఇంట్లో పదుల సంఖ్యలో ఓట్లు ఉన్నాయా? 18 ఏళ్లు నిండినా ఓటరుగా నమోదు కాలేదా? ఇలాంటి ప్రతి సమస్యకు పరిష్కారం చూపేందుకు, తప్పులను సరిదిద్దేందుకు బీఎల్‌వోలు ఇంటింటికీ వస్తున్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ నెల 21 నుంచి ఓటర్ల సంక్షిప్త జాబితా సవరణ ప్రక్రియకు అధికార యంత్రాంగం శ్రీకారం చుట్టింది.



తుమ్మపాలలో ఇంటింటా సర్వే చేస్తున్న బీఎల్‌వో



రేబాక గ్రామంలో ఓటర్ వివరాలను పరిశీలిస్తున్న ఆర్డీవో ఏజే చిన్నికృష్ణ

- ఇంటింటా ఓటర్ల సవరణ ప్రక్రియలో బీఎల్వోలు
- వచ్చే నెల 21 వరకూ కొనసాగనున్న సర్వే
- నియోజకవర్గంలో 2,08,030 మంది ఓటర్లు

అనకాపల్లి రూరల్: ఈ ఏడాది ఓటర్ల సవరణ మరింత ఖచ్చితంగా, పారదర్శకంగా చేపట్టేందుకు అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా అనకాపల్లి నియోజకవర్గంలో బూత్ లెవెల్ అధికారు(బీఎల్‌వో)లు వెరిఫికేషన్ ప్రక్రియను ప్రారంభించారు. ప్రతీ ఇంటికి వెళ్లి మొబైల్ యాప్‌లో ఓటర్ల పూర్తి వివరాలను నమోదు చేస్తున్నారు. సవరణలతో పాటు ఫొటో, అడ్రస్ మార్పులు వంటివి ఓటర్ ఆమోదంతో చేస్తున్నారు. సార్వత్రిక ఎన్నికలు మరో 9 నెలల్లో జరగనున్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ప్రస్తుతం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ-2024 కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. 2024 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండే ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని అధికారులు చెప్తున్నారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పూర్తి చేసి 2024 జనవరి 5న తుది ఓటరు జాబితాను ఎన్నికల కమిషన్ ప్రకటించనుంది. దీంతో ఓటరు జాబితా సవరణపై రాజకీయ పార్టీలు ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నాయి.

బీఎల్‌వోలకు రిజిస్టర్లు, దరఖాస్తులు

ఓటరు జాబితా సవరణలో భాగంగా ఈ నెల 21న ప్రారంభమైన ఇంటింటి సర్వేలో పాల్గొనే బీఎల్‌వోల చేతికి ఓటు సవరణకు సంబంధించి రిజిస్టర్లు, కొత్తగా ఓటరు నమోదుకు(ఫారం-6), ఓటు తొలగింపునకు(ఫారం-7), నియోజకవర్గ పరిధిలో ఓటు బదిలీకి(ఫారం-8) దరఖాస్తులను జిల్లా యంత్రాంగం అందించింది. ఓటరు జాబితా సవరణకు సంబంధించి ఇప్పటికే బీఎల్‌వోలకు శిక్షణ ఇచ్చారు. సవరణ పక్కాగా చేపట్టేందుకు బీఎల్‌వో ఓటరు యాప్(వెర్షన్ 4.7)ను ఇన్‌స్టాల్ చేశారు. కొత్త ఓటు నమోదు, పాతవి తొలగించడం యాప్‌లోనే చేయాల్సి ఉంటుంది. కొత్తగా ఓటు హక్కు పొందాల్సినవారు దరఖాస్తు నింపి, బీఎల్‌వోలకు అందించాలి. ఒకే కుటుంబంలోని ఓటర్లందరినీ ఒకే పోలింగ్ స్టేషన్‌కు అనుసంధానించేందుకు ఇంటింటా సర్వే ఉపయోగపడనుంది.

విస్తృత అవగాహన

ఓటర్ల సవరణ ప్రక్రియపై జిల్లా యంత్రాంగం విస్తృతంగా అవగాహన కల్పిస్తోంది. వివిధ ప్రసార మాధ్యమాల ద్వారా ప్రచారం చేయడంతోపాటు బీఎల్‌వోలకు, సంబంధిత అధికారులకు అవగాహన కల్పించారు. వివిధ రాజకీయపార్టీల నాయకులతో కూడా అధికారులు సమావేశాలు నిర్వహించారు. ఓటర్ల సవరణ ప్రక్రియలో సహకరించాలని కోరారు. జాబితాలో రెండు చోట్ల ఓట్లు, నకిలీ ఓట్ల గుర్తింపు, మరణించిన వారి ఓట్ల తొలగింపుపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. వందేళ్లు పైబడి వయసున్న వారిని గుర్తించే పని కూడా నిశితంగా చేపడుతున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పారదర్శకమైన ఓటరు జాబితాను సిద్ధం చేసేందుకు పూర్తి సహకారం అందించాలని అధికారులు రాజకీయపార్టీలను, ఓటర్లను కోరుతున్నారు.

అనకాపల్లి నియోజకవర్గంలో ఓటర్లు

మండలం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
అనకాపల్లి	73,614	78,146	5	1,51,765
కశింకోట	27,274	28,990	1	56,265
మొత్తం	1,00,888	1,07,136	6	2,08,030

ఓటు సరిచూసుకోవాలి



ఇంటింటా సర్వేను ఓటర్లు సద్వినియోగపర్చుకోవాలి. బీఎల్‌వోలు ఇంటికి వచ్చినపుడు ఓటరు ఐడీ కార్డులు, పేరు, చిరునామా, వయస్సు, ఆధార్, ఇతర వివరాలు సరిచూసుకోవాలి. ఫొటో చక్కగా లేకపోతే అక్కడికక్కడే ఫొటోను అప్‌డేట్ చేసుకోవాలి. తప్పులు సరిదిద్దేందుకు అవసరమైన ఆధారాలను బీఎల్‌వోలకు సమర్పించాలి. ప్రక్రియ సజావుగా, గడువులోగా పూర్తయ్యేందుకు బీఎల్‌వోలకు ప్రజలు, రాజకీయపార్టీలు సహకరించాలి.

– పీవీఎల్ఎన్ గంగాధరరావు, తహసీల్దార్, అనకాపల్లి

సంక్షేమ రక్ష.. జగనన్న సురక్ష



ధ్రువపత్రాన్ని అందిస్తున్న కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి



డీటీ శ్రీరామమూర్తిని సత్కరిస్తున్న ప్రసన్నలక్ష్మి, మురళీకృష్ణ, రమేష్‌లు

జగనన్న సురక్షలో 1560 ధ్రువపత్రాల పంపిణీ

అనకాపల్లిటౌన్: జగనన్న సురక్ష కార్యక్రమంలో అర్హులైన లబ్ధిదారులకు ఉచితంగా 11 రకాలైన ధ్రువపత్రాలను అందించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని 83వ వార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి అన్నారు. స్థానిక వేల్పులవీధి శ్రీసీతారామ కల్యాణమండపంలో 7, 8, 9 సచివాలయ పరిధి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరి సంక్షేమం కోసం నిరంతరం తపిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకునే బాధ్యత మన అందరిపైనా ఉందన్నారు. కరోనా వంటి విపత్తుల సమయంలో రాష్ట్రానికి ఆదాయం లేనప్పటికీ బడుగు, బలహీన వర్గాల ప్రజలను ఆదుకునేందుకు సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత ఈ ప్రభుత్వానికే దక్కిందన్నారు. గత ప్రభుత్వాల్లో వివిధ రకాలైన ధ్రువపత్రాలు కావాలంటే కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేదని, జగనన్న పాలనలో అధికారులే ప్రజల ప్రజల వద్దకు వచ్చి జగనన్న సురక్ష కార్యక్రమంలో ఉచితంగా 11 రకాలైన ధ్రువపత్రాలను అందించడం అభినందనీయమన్నారు.

ఈ సందర్భంగా వలంటీర్లు, గృహసారథుల వద్ద నమోదు చేసుకున్న 1,560 మందికి ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం జగనన్న సురక్ష కార్యక్రమంలో పట్టణ, మండల పరిధిలో సకాలంలో ధ్రువపత్రాలను అందించడంలో కృషి చేసిన డీటీ వై.శ్రీరామమూర్తిని పట్టణ సచివాలయాల కన్వీనర్ కొణతాల మురళీకృష్ణ, వార్డు ఇన్‌చార్జి జాజుల రమేష్‌లతో కలిసి శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీ ఎస్.వెంకటరమణ, జీవీఎంసీ ఏపీడీ వీకే దొర, ఆర్‌ఐ మర్రా చంద్రశేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకులు వేల్పుల గణేష్, ఉగ్గిన అప్పారావు, గొర్లి చిన్న, బొండా శంకరరావు, గుండా రమేష్‌గుప్తా, జెట్టి శ్రీనివాసరావు, కొంకి శ్రీరామమూర్తి, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాపై రాజకీయ పార్టీలతో భేటీ



వివిధ రాజకీయ పార్టీల నేతలతో మాట్లాడుతున్న ఆర్డీవో చిన్నికృష్ణ

అనకాపల్లిటౌన్: స్థానిక ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం వివిధ రాజకీయపార్టీ నేతలతో ఆర్డీవో ఏజే చిన్నికృష్ణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఓటర్లు జాబితాపై ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఓటర్ల జాబితాల్లో ఎక్కడైనా పొరపాట్లు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. సమావేశంలో ఆమ్ ఆద్మీ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కొణతాల హరనాథ్‌బాబు, సీఐటీయూ జిల్లా నాయకుడు గంటా శ్రీరామ్, ప్రజాసంఘాల కన్వీనర్ బొట్టా చిన్నయాదవ్, బీఎస్పీ నేత ఎస్‌వీవీ రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ అనుసంధానంతో నకిలీ ఓట్లకు చెక్

ఓటర్ కార్డుకు ఆధార్‌కార్డుతో అనుసంధానం చేయడం, సవరణలకు ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నట్టు ఆర్డీవో ఏజే చిన్నికృష్ణ తెలిపారు. మండలంలోని రేబాక గ్రామం, పట్టణంలోని గవరపాలెం వేగి వీధిలో ఇంటింటా సర్వే తీరును మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత, కొత్త ఓటర్ల జాబితాను పరిశీలించి రెండు చోట్ల ఉన్న ఓట్ల తొలగింపు, కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ కొనసాగుతోందన్నారు. అగస్టు 21 వరకూ ఈ ఓటరు జాబితా పరిశీలన కార్యక్రమం జరుగుతుందన్నారు. ఆధార్ కార్డుకు ఓటర్ కార్డు అనుసంధానంతో దొంగ ఓట్లను తొలగించవచ్చన్నారు. గ్రామీణ స్థాయి నుంచి బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి, ఓటర్ల జాబితాను పరిశీలించి, మార్పులు చేర్పులు చేసి కొత్త జాబితాను సిద్ధం చేస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

వర్క్‌షాపులతో ఆధునిక నైపుణ్యాలు



వర్క్‌షాప్‌లో పాల్గొన్న దైట్ కళాశాల ప్రిన్సిపాల్ వైకుంఠరావు

అనకాపల్లిటౌన్: ఎప్పటికప్పుడు మారుతున్న ఆధునిక నైపుణ్యాలను విద్యార్థులు నేర్చుకోవాలని దైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.వైకుంఠరావు సూచించారు. కళాశాల ఆవరణలో జరుగుతున్న సివిల్ ఆర్కిటెక్చర్ వర్క్‌షాప్ రెండోరోజైన మంగళవారం కొనసాగింది. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంచేందుకు భవిష్యత్తులో మరిన్ని వర్క్‌షాపులు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు ఈ వర్క్‌షాపులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ఎస్.రాము మాట్లాడుతూ ప్రస్తుతం పరిశ్రమల్లో ఉన్న అవకాశాలను వివరిస్తూ సివిల్ ఇంజినీర్ ఆచరణాత్మక విద్యను అభ్యసించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ఐఈఐ కన్వీనర్ వై.హేమంత్‌కుమార్, ఏపీఎస్ఎస్‌డీసీ ట్రైనర్ దాలినాయుడు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



ఎంపీపీ వెంకటపద్మలక్ష్మి, శ్రీనివాసరావు దంపతులను సత్కరిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

పరవాడ: యోగాతో సంపూర్ణ ఆరోగ్యంతో పాటు ఏకాగ్రతను పెంపొందించుకోవచ్చునని పరవాడ ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి అన్నారు. సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్సార్ విభాగం సౌజన్యంతో అనకాపల్లి జిల్లా యోగాజన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వెన్నలపాలెం ఏసీ కల్యాణ మండపంలో నిర్వహించిన జిల్లా స్థాయి యోగా పోటీలను ఆమె మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ యోగాసనాలు మనస్సును, ఆత్మను, శరీరాన్ని ఏకం చేసే మహోన్నతమైన సాధనమన్నారు. అనంతరం ఎంపీపీ వెంకటపద్మలక్ష్మి, శ్రీనివాసరావు దంపతులను అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెన్నల అప్పారావు, ఉపసర్పంచ్ వెన్నల సన్యాసిరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కోన రామారావు, పెందుర్తి మాజీ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు పైల అప్పలనాయుడు, ఎంఈవో శైలజ, పార్టీ నాయకులు రెడ్డి శ్రీనివాసరావు, వి.సింహాద్రి, ఎం.ముత్యాలనాయుడు, యోగా శిక్షకుడు సిహెచ్.ఆంజనేయులు, పలు పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్పొరేట్ సెలూన్లకు అనుమతులు వద్దు



సమావేశంలో మాట్లాడుతున్న నాయీబ్రాహ్మణులు

యలమంచిలి : రిలయన్స్ కార్పొరేట్ సెలూన్ షాపుల వల్ల నాయీ బ్రాహ్మణుల వృత్తి అంతరించి పోయే ప్రమాదం ఉందని యలమంచిలి నాయీబ్రాహ్మణ సంఘం సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం యలమంచిలి కొమ్మాయిగుండం శివపార్వతుల ఆలయం వద్ద యలమంచిలి నాయిబ్రాహ్మణ సంఘం సభ్యులు ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ త్వరలో రాష్ట్రంలో రిలయన్స్ కార్పొరేట్ సంస్థ సెలూన్ షాపులను బ్యూటీ పార్లర్‌లు, బ్యూటీ సెలూన్‌లను పట్టణ ప్రాంతాల్లో నిర్వహించడానికి సన్నాహాలు చేస్తోందని, వాటికి ప్రభుత్వం అనుమతులు మంజూరు చేస్తే నాయీబ్రాహ్మణ వృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్న పేద కుటుంబాలు ఉపాధి కోల్పోవలసి వస్తుందని అన్నారు. సంప్రదాయ చేతి వృత్తిని నమ్ముకున్న నాయీబ్రాహ్మణులకు జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలతో ఆదుకుంటున్నారని అన్నారు. నాయిబ్రహ్మణులకు షాపులకు 150 యూనిట్ల కరెంట్‌ను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని తెలిపారు. అందుకు సంఘం తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. కాగా పట్టణంలో సామాజిక భవనం లేక నాయీ బ్రాహ్మణులు ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు స్పందించి పట్టణంలో ఎక్కడైనా 5 సెంట్లు స్థలం మంజూరు చేస్తారని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ పట్టణ అధ్యక్షుడు కందికుప్ప గోవిందరావు, ప్రధాన కార్యదర్శి, కడిమి అప్పలరాజు, కోశాధికారి చల్లపల్లి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర భూ రీ సర్వేపై ఆర్‌డీవో ఆరా

మునగపాక : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీ-సర్వే వేగవంతమయ్యేలా చూడాలని అనకాపల్లి ఆర్‌డీవో చిన్నికృష్ణ కోరారు. మంగళవారం మునగపాక రెవెన్యూ కార్యాలయానికి వచ్చిన ఆయన ఇంతవరకు ఎన్ని గ్రామాల్లో రీ-సర్వే పూర్తయింది, ఏఏ గ్రామాల్లో సర్వే జరుగుతుందని తహసీల్దార్ పి.ప్రకాశరావును వివరాలు అడిగి తెలుసుకున్నారు. సర్వే పూర్తయిన గ్రామాల్లో రైతుల సమక్షంలో సరిహద్దు రాళ్లు వేయించాలన్నారు. ఇందుకోసం రైతులకు ముందస్తు సమాచారం అందించాలన్నారు. ఆయన వెంట డీటీ వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మునగపాక : మండలంలోని పలు గ్రామాల్లో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీవో మన్మథరావు తెలిపారు. ఒంపోలు(ఓసీ జనరల్, బీసీ-డి మహిళ, బీసీ-డి పురుషుల)కు సంబంధించి పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. చెర్లోపాలెం(ఓసీ జనరల్), తిమ్మరాజుపేట(ఓసీ జనరల్), తోటాడ(బీసీ ఏ మహిళ), టి.సిరసపల్లి-1(బీసీ-డి మహిళ), మునగపాక-1,2(బీసీ-డి మహిళ, బీసీ-డి పురుషుడు, బీసీ-డి మహిళ), టి.సిరసపల్లి-2(బీసీ-డి పురుషుడు) పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. అభ్యర్థులు 18 నుంచి 35 సంవత్సరాల లోపు వయస్సు ఉండి పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. 26, 27 తేదీల్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపికైన వలంటీర్లకు 31న పోస్టింగ్ ఉత్తర్వులు జారీ చేయనున్నట్టు వెల్లడించారు.

జగనన్న సురక్ష నేడు

అనకాపల్లిటౌన్: మండలంలోని కొత్తూరు సచివాలయం-1, సీహెచ్ఎన్ అగ్రహారం గ్రామాల్లో బుధవారం ఉదయం 10 గంటలకు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కె.వి.నరసింహరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీపీ గొర్లి సూరిబాబులు విస్తారని పేర్కొన్నారు. ప్రభుత్వ విభాగాల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, దరఖాస్తుదారులు హాజరు కావాల్సిందిగా కోరారు.

రోజంతా వాన

కశింకోట: మండలంలో మంగళవారం దఫదఫాలుగా వర్షం కురిసింది. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు ఇదే పరిస్థితి. వర్షం వల్ల కశింకోటలో సాయంత్రం రెండు గంటలకు పైగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు వరి నారుమడులకు, కొత్తగా నారు వేసుకోవడానికి ఉపకరిస్తాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గిట్టుబాటు ధరల కోసం ఉద్యమించాలి



రైతు సదస్సులో మాట్లాడుతున్న రైతు సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ

మునగపాక: పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు దక్కేందుకు రైతులంతా ఉద్యమానికి సిద్ధం కావాలని రైతు సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.సూర్యనారాయణ కోరారు. మునగపాక పీఏసీఎస్ కార్యాలయం ఆవరణలో మంగళవారం జరిగిన రైతు సదస్సు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతు వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కేంద్ర ప్రభుత్వంపై పోరాటాలకు రైతులు సిద్ధంగా ఉండాలన్నారు. జిల్లాలో మూతపడిన చక్కెర కర్మాగారాలను తెరిపించాలని, పాలకు కనీస మద్దతు ధర రూ.70 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెల 30న విజయవాడలో జరిగే రాష్ట్ర సదస్సు, ఆగస్టు 9న సేవ్ అగ్రికల్చరల్, క్విట్ కార్పొరేట్ పేరుతో జరిగే కార్యక్రమాలను రైతులంతా జయప్రదం చేయాలన్నారు. రైతు సంఘ నాయకుడు కర్రి అప్పారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మునగపాక రైతు సంఘ అధ్యక్షుడు ఆడారి మహేష్, రైతుస్వరాజ్య వేదిక నాయకుడు బాలు గాడి, రైతు సంఘ నాయకులు గణేష్, అప్పలరాజు, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో హింసను అరికట్టాలి



నాలుగు రోడ్ల కూడలి వద్ద ధర్నా చేస్తున్న యూటీఎఫ్, సీఐటీయూ నేతలు

అనకాపల్లి రూరల్: మణిపూర్‌లో దాడుల్ని అరికట్టడంతోపాటు, హింసకు కారకులైన వారిని శిక్షించాలని యూటీఎఫ్, సీఐటీయూ నేతలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సాయంత్రం పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద రెండు సంఘాల నేతలు ధర్నా చేశారు. మహిళలపై దారుణాలను అరికట్టడంలో ఆ రాష్ట్ర ప్రభుత్వంతో పాటు కేంద్ర ప్రభుత్వం కూడా విఫలమైందని ఆరోపించారు. అక్కడ తక్షణమే శాంతి నెలకొనేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అల్లర్లు, దాడులతో మణిపూర్ అట్టుడికిపోతున్నా ప్రధాని మోదీ స్పందించడం లేదని, ఇప్పటికైనా కేంద్రం కళ్లు తెరవాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకరరావు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వత్సవాయి శ్రీలక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయ్, జీఎస్ ప్రకాష్, గేదెల శాంతిదేవి, మామిడి అరుణ, కరుణ జ్యోతి, సీఐటీయూ నాయకులు బాలకృష్ణ, గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం జిల్లా కార్యదర్శి గంటా శ్రీరాం, వి.శ్రీనివాసరావు, నాయనబాబు, అజయ్, ఏఐడీడబ్ల్యూఏ నాయకురాలు వరలక్ష్మి, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నారు పోతకు చలో చలో



దిమిలి సమీపంలో విత్తనాలు జల్లుతున్న రైతు



యంత్ర సాయంతో దుక్కి చేస్తున్న రైతు

- ముమ్మరంగా పొలం పనులు
- శారద నదిలో పుష్కలంగా నీరు
- ఆర్‌బీకేల ద్వారా రైతులకు సేవలు

రాంబిల్లి : ఖరీఫ్ పనులు జోరందుకున్నాయి. రైతులు ఉత్సాహంగా ఖరీఫ్ సాగు పనుల్లో నిమగ్నమై బిజీబిజీగా ఉన్నారు. శారద నదిలో పుష్కలంగా సాగు నీరు ప్రవహిస్తోంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా నదిలో నీరు ప్రవహిస్తోంది. యలమంచిలి నియోజకవర్గంలో ప్రధాన పంటగా రైతులు వరి పంటను సాగు చేస్తున్నారు. నియోజకవర్గంలో రాంబిల్లి మండలంలో దాదాపు 8వేల ఎకరాల్లో వరి పంటను రైతులు సాగు చేస్తున్నారు. యలమంచిలి మండలంలో 5500 ఎకరాలు, మునగపాక మండలంలో 4100 ఎకరాలు, అచ్యుతాపురం మండలంలో 2800 ఎకరాల్లో రైతులు వరి పంటను సాగు చేస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటికే పలు ప్రాంతాల్లో వరి విత్తనాలు వేశారు. అడపా దడపా కురుస్తున్న వర్షాలతో పాటు శారదా నదిలో ప్రవహిస్తున్న నీరుతో తడులు పెట్టారు. దీంతో నారు ఇప్పటికే నాటింది. మిగిలిన ప్రాంతాల్లో ముమ్మరంగా వరి విత్తనాలు వేస్తున్నారు. యంత్రాలను వినియోగిస్తూ రైతులు దుక్కి పనులు చేస్తున్నారు. సాగులో యంత్ర వినియోగంపై రైతులు ఆసక్తి చూపిస్తున్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం

జగనన్న సర్కారు రైతులకు అండగా నిలుస్తుంది. రైతు భరోసా నిధులను క్రమం తప్పకుండా ప్రతి ఏటా రైతుల ఖాతాల్లో జమ చేస్తోంది. ఈ సాయం సాగు ఖర్చులకు ఉపయోగపడుతున్నాయి. ఆర్‌బీకేల ద్వారా సకల సేవలు అందిస్తున్నారు. విత్తనాలు, ఎరువులు అందజేస్తున్నారు. రైతులకు సాగు విధానంలో సందేహాలు నివృత్తి చేస్తూ సలహాలు, సూచనలు అందజేస్తున్నారు. ధాన్యం కొనుగోలు చేస్తూ రైతులను ఆదుకుంటున్నారు.

ప్రధాన కూడళ్లలో విద్యుత్ లైట్లు



కశింకోట పోలీసు స్టేషన్ వద్ద విద్యుత్ స్తంభానికి లైట్ బిగిస్తున్న ఎన్‌హెచ్‌ఏఐ సిబ్బంది

కశింకోట: భారత జాతీయ రహదారుల సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ) వారు ప్రధాన కూడళ్ల వద్ద ప్రయాణికులు, వాహన చోదకులకు వెలుగు కోసం విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. కశింకోట కూడలి, సమీపంలోని పడమటమ్మ ముఖ ద్వారం, పోలీస్ స్టేషన్, పరవాడ పాలెం జంక్షన్ తదితర ప్రాంతాల్లో రెండు వైపులా విద్యుత్ స్తంభాలకు మంగళవారం వీటిని అమర్చారు. జాతీయ రహదారిపై విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులకు నివేదించగా, ఈ మేరకు సదరు సిబ్బంది చర్యలు తీసుకున్నట్లు స్థానిక ఎస్‌ఐ ఎ.ఆదినారాయణరెడ్డి తెలిపారు.